క్లుప్తంగా

ఎస్పీ కృష్ణారావుకు సత్కారం

అమలాపురం టౌన్: ఇటీవల జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన బి.కృష్ణారావును జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రతినిధుల బృందం శుక్రవారం కలిసి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపింది. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కామన ప్రభాకరావు ఆధ్వర్యంలో నాయకులు స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ కృష్ణారావు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఏఐసీసీ మెంబర్ యార్లగడ్డ రవీంద్ర, జిల్లా పార్టీ ఎస్సీ ఎస్టీ సెల్ చైర్మన్ వడ్డి నాగేశ్వరరావు, పార్టీ నాయకులు దేశనీడి ఉదయ భాస్కరరావు, అప్పన శ్రీరామకృష్ణ తదితరులు ఎస్పీని కలిసిన వారిలో ఉన్నారు.

తల్లిపాలతో బిడ్డకు రోగనిరోధక శక్తి వృద్ధి



పత్తిగొందిలో తల్లిపాలు ప్రాముఖ్యతను వివరిస్తున్న సూపర్‌వైజర్ నిభావాణి

తాళ్లరేవు: పి.మల్లవరం పంచాయతీ పత్తిగొంది ఎస్సీపేట అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ వి.మాధవి ఆదేశాల మేరకు సూపర్‌వైజర్ నిభావాణి ఆధ్వర్యంలో పలువురి గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు అమృతం వంటివని, అవి రోగనిరోధకతను పెంచి జీవితకాలం టీకా వలే పనిచేస్తాయన్నారు. తల్లిపాలు శిశువుకు పట్టడం వల్ల బిడ్డతోపాటు తల్లికి అనేక ప్రయోజనాలు కలుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది, గర్భిణులు పాల్గొన్నారు.

5కే రన్ విజేత శ్రీలక్ష్మి



విద్యార్థిని శ్రీలక్ష్మిని అభినందిస్తున్న హెచ్ఎం రాజరాజేశ్వరి

అమలాపురం టౌన్: హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కోసం యూత్ ఫెస్ట్ (మారథాన్, క్విజ్) సందర్భంగా అమలాపురంలో శుక్రవారం ఉదయం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నిర్వహించిన 5 కే రన్‌లో స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థిని చాట్ల బాల శ్రీలక్ష్మి బాలికల విభాగంలో మొదటి స్థానాన్ని సాధించింది. శ్రీలక్ష్మి జిల్లా మొదటి స్థానంతో పాటు రూ.7 వేలు నగదు బహుమతి పొందిందని పాఠశాల హెచ్ఎం ఎస్.రాజరాజేశ్వరి తెలిపారు. పాఠశాలలో విద్యార్థిని శ్రీలక్ష్మికి ప్రధానోపాధ్యాయురాలు రాజరాజేశ్వరి పూల బొకే అందించి ప్రత్యేకంగా అభినందించారు.

శిశువు వైద్యానికి ఆర్థిక సాయం



బాబు కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న ఎంపీడీఓ, తహసీల్దార్

అల్లవరం: ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతూ నెల రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పసి బిడ్డకు చికిత్స కోసం ఆర్థికసాయం అందించేందుకు అల్లవరం సమాచారం గ్రూపు సభ్యులు ముందుకువచ్చి తమ ఔదార్యం చూపించారు. పసి బిడ్డ ఆరోగ్యానికై సాయం అందించాలని గ్రూప్‌లో ఊపిరి నిలపండి కథనాన్ని పోస్టు చేశారు. దీంతో ఈ గ్రూపులోని అధికారులు, ప్రజా ప్రతినిధులు, మీడియా మిత్రులు మానవతా దృక్పథంతో స్పందించి రూ. 24 వేలును సమకూర్చారు. సభ్యుల నుంచి సమకూర్చిన నగదుని అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కృష్ణమోహన్, తహసీల్దార్ సునీల్ కుమార్ చేతుల మీదుగా బాబు కుటుంబసభ్యులకు శుక్రవారం అందించారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి లక్ష్మణరావు, కార్యదర్శులు రాజమోహన్, కేవీవీ సత్యనారాయణ, శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

స్టేట్‌హుడ్‌పై కేంద్రానికి తీర్మానం పంపుతాం

యానాం: పుదుచ్చేరికి స్టేట్‌హుడ్ ఇవ్వాలని కోరుతూ అసెంబ్లీలో మళ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామని సీఎం రంగసామి తెలిపారు. శుక్రవారం అసెంబ్లీలో ఆయన బడ్జెట్‌కు సంబంధించి జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. రూ.12,700 కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్ ద్వారా నూతన పథకాలు, ప్రాజెక్టులు అమలు చేయడానికి వీలుపడుతుందన్నారు. పుదుచ్చేరి అభివృద్ధికి రాష్ట్ర హోదా ముఖ్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇప్పటివరకు చాలాసార్లు తీర్మానం చేసి కేంద్రానికి పంపిందన్నారు. ఈసమస్యపై ఎంపీలు సైతం పోరాటం చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

ముంచుతున్న డ్రెయిన్లు

- రైతులకు ఏటా తప్పని వరద కష్టాలు
- 40 వేల ఎకరాల్లో ముంపు సమస్య



కామనగరువు వద్ద గుర్రపు డెక్కతో పూడుకుపోయిన వాసాలతిప్ప డ్రెయిన్



ఇటీవల వర్షాలకు చిందాడ గరువులో చెరువుగా మారిన వరిచేలు

అమలాపురం రూరల్: అమలాపురం నియోజకవర్గంలో వరి చేల నుంచి ముంపునీరు సముద్రంలోకి మళ్లించే డ్రెయిన్లు పూడుకుపోయి కుచించుకుపోయాయి. గుర్రపుడెక్క పేరుకుపోవడంతో డ్రెయిన్లు కుచించుకుపోయి వరద ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. దీంతో ఏటా ఆయకట్టు రైతులకు ముంపు బాధ తప్పడం లేదు. వాసాలతిప్ప, కుమర్శి కాలువ డ్రెయిన్లు మూసుకుపోవడంతో రైతుల పంట పొలాలు ముంపుబారిన పడుతున్నాయి. వాసాలతిప్ప మీడియం డ్రెయిన్ అమలాపురం మండలం కామనగరువు చిట్టెమ్మ చెరువు ప్రాంతంలో ప్రారంభమై కామనగరువు, చిందాడగరువు, తాండవపల్లి, వన్నెచింతలపూడి, ఉప్పలగుప్తం మండలం సిరిపల్లె, చల్లపల్లి మీదుగా సముద్రంలో కలుస్తుంది. 18 కిలోమీటర్ల ప్రవహించి మురుగునీటి సముద్రంలో కలుపుతుంది. ఈ డ్రెయిన్ అల్లవరం, ఉప్పలగుప్తం, అమలాపురం మండలాల పరిధిలో సుమారు 20 వేల ఎకరాల ఆయకట్టులోని మురుగు నీరు దిగుతుంది. ముంపునీరు ప్రవహించే వాసాలతిప్ప డ్రెయిన్ కుచించుకుపోవడంతో రైతుల పంట పొలాలు ముంపుబారిన పడుతున్నాయి. డ్రెయినేజీ శాఖ ఈ డ్రెయిన్‌ను ఆధునీకరించకపోవడం, పూడిక తొలగించకపోవడంతో ఏటా ఖరీఫ్ పంటను రైతులు కోల్పోతున్నారు. 1991లో సైక్లోన్ రిలీఫ్ ఎమర్జెన్సీ ఫండ్ (సీఆర్‌పీ) పథకంలో డ్రెయిన్‌ను ఆధునీకరించారు. అప్పటి నుంచి ఈ డ్రెయిన్‌ను పట్టించుకోకపోవడంతో ఆక్రమణలు, పూడికతో మూసుకుపోయింది. డ్రెయినేజీ శాఖ అధికారులు నిర్లక్ష్యం వహించడంతో కొందరు రైతులే స్వచ్ఛందంగా గుర్రపుడెక్కను తొలగించుకున్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ముంపునీరు దిగకపోవడంతో వేలాది ఎకరాల్లోని పంటలను రైతులు నష్టపోతున్నారు. అమలాపురం మున్సిపాలిటీ నుంచి వచ్చే మురికినీటి డ్రెయిన్‌ను వాసాలతిప్ప డ్రెయిన్‌లో కలిపారు. పట్టణంలో వచ్చిన వర్షపు నీరు ఈ డ్రెయిన్‌ను ముంచెత్తి ఎగదన్ని పంట పొలాల్లోకి నీరు చేరుతోంది. దీంతో పంటలు కుళ్లిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు మాత్రం మరమ్మతులు చేస్తామని హామీలు ఇస్తూ కాలయాపన చేస్తున్నారు.

ఆక్వా చెరువులతో ఇబ్బందులు

వేలాది ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతోంది. ఆక్వా చెరువుల నుంచి వచ్చే నీరు డ్రెయిన్‌ను ముంచెత్తి పంటలు దెబ్బతింటున్నాయని రైతులు చెబుతున్నారు. రైతులు ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులకు పలు సార్లు విన్నవించుకున్నా ప్రయోజనం లేకపోతోందని రైతులు అంటున్నారు. డ్రెయిన్లలో గుర్రపు డెక్క, తూడు తొలగించేందుకు ప్రభుత్వం జిల్లాకు రూ.7 కోట్లు ఇటీవల మంజూరు చేసింది. ఇప్పటివరకు అక్కడక్కడ కొన్ని పనులు ప్రారంభించారు. నిర్వహణ పనులకు సంబంధించి నిధులిచ్చినా అధి కారుల అలసత్వం కారణంగా పనులు చేయకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఆక్రమణలో కుమ్మరికాలువ మేజర్ డ్రెయిన్

కుమ్మరికాలువ మేజర్ డ్రెయిన్ ఆక్రమణతో మూసుకుపోయింది. అమలాపురం రూరల్ అయినవెల్లి మండలాల్లో ముంపునీరు మరొక వైపు కుమ్మరికాలువ డ్రెయిన్ అంబాజీపేట మండలం వక్కలంకలో ప్రారంభమై అల్లవరం మండలం గోపాయిలంక వద్ద వైనతేయ గోదావరిలో కలుస్తుంది. ఈ డ్రెయిన్‌పై అల్లవరం, అమలాపురం, అంబాజీపేట మండలాల పరిధిలో 20 వేల ఎకరాల వ్యవసాయ భూమి సాగవుతుంది. ఇటీవల వరదల కారణంగా నీరు ఎగువకు ప్రవహించడంతో పొలాలు ముంపునకు గురయ్యాయి. ముంపు నీరు దిగువకు వెళ్లేందుకు గుర్రపు డెక్క అడ్డుపడింది. ఇటీవల కురిసిన వర్షాల వల్ల జనుపెల్ల, నల్లమిల్లిలో గ్రామాల్లో 200 ఎకరాల్లోని పంట ముంపు బారిన పడింది. గుర్రపుడెక్క మేటలా పేరుకుపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందని రైతులు వాపోతున్నారు.

ఏటా ఖరీఫ్ పంట నష్టం

వాసాలతిప్ప, కుమ్మరి కాలువ డ్రెయిన్లు మరమ్మతులు చేయకపోవడంతో ఏటా రైతులకు ఖరీఫ్ పంట పూర్తిస్థాయిలో దక్కడంలేదు. కనీసం డ్రెయిన్‌లో గుర్రపుడెక్క, పూడిక తొలగించాలని అధికారులను కోరుతున్నా పట్టించుకోవట్లేదు. ఏటా ఖరీఫ్‌లో వేలాది ఎకరాల్లో పంట ముంపు బారిన పడి నష్టపోతున్నాం.

– అప్పారి చిన వెంకటరమణ, రైతు నాయకుడు, నల్లమిల్లి

గుర్రపుడెక్క, తూడు తొలగింపునకు చర్యలు

అమలాపురం నియోజకవర్గంలోని డ్రెయిన్లలో తూడు, గుర్రపుడెక్క పనులు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. డివిజన్ పరిధిలో కొన్ని డ్రెయిన్లలో పనులు ప్రారంభించాం. అమలాపురం నియోజకవర్గంలో పనులు ప్రారంభించేందుకు త్వరలో చర్యలు తీసుకుంటాం. వర్షాల వల్ల పనులు ప్రారంభం కాలేదు.

– హిమరత్న, అమలాపురం డ్రెయిన్స్ డీఈఈ

వైభవంగా నాగ పంచమి పూజలు



నాగ పంచమి పూజలు చేస్తున్న అక్షయ పాత్ర ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక విద్యుత్ నగర్‌లోని ఆదిశేష నిలయంలో శ్రావణ నాగ పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమ మహర్షి అక్షయ పాత్ర అధ్యక్షురాలు పోతురాజు నాగ కనకదుర్గ భక్తులకు నాగ పంచమి విశిష్టతను వివరించారు. అక్షయ పాత్ర ప్రతినిధి చాగంటి ప్రసాద్ దంపతులు కర్తలుగా నాగ పంచమి పూజలు నిర్వహించారు. సేవకురాలు నూకల కుమారి తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి సర్పంచ్‌లకు శిక్షణ

అల్లవరం: అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 12 నుంచి 14 వరకు సర్పంచ్‌లకు 15 వ ఆర్థిక సంఘ నిధుల వినియోగం, ఘన వ్యర్థాల నిర్వహణపై శిక్షణనిస్తామని ఎంపీడీఓ కృష్ణమోహన్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, డీఏలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. మూడు రోజుల పాటు కొనసాగే ఈ శిక్షణా కార్యక్రమానికి సర్పంచ్‌లు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన తెలిపారు. అనంతరం అల్లవరం తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తూ బదిలీపై వెళ్తున్న పి.సునీల్‌కుమార్‌ను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ దుర్గా శ్రీనివాస్, కార్యదర్శులు రాజమోహన్, కేవీవీ సత్యనారాయణ, పిల్లి శ్రీనివాస్, శ్రీరామచంద్రమూర్తి, మృదుల, కనకమ్మ, రవి రాజు, వీరబాబు, కుమారి, డీఏలు పాల్గొన్నారు.

పంటలకు మద్దతు ధర చట్టం కోరుతూ ఆందోళన



అమలాపురంలో ధర్నా చేస్తున్న సీఐటీయూ, కౌలు రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల ప్రతినిధులు

అమలాపురం టౌన్: రైతులు ఆరుగాలం శ్రమించే పంటలకు మద్దతు ధర చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ అమలాపురం గడియారం స్తంభం సెంటరులో సీటీటీయూ ఆధ్వర్యంలో కౌలు రైతులు, వ్యవసాయ కార్మిక సంఘాలు శుక్రవారం ధర్నా చేశాయి. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం రైతులకు మద్దతు ధర ఇవ్వడంలో విఫలమవుతోందని ఆయా సంఘాల ప్రతినిధులు విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గా ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎస్.బలరామ్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సీతల రామచంద్రరావు ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వంపై వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఐటీయూ, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక, ప్రజా సంఘాల నాయకులు అప్పారి వెంకటేశ్వరావు, నిమ్మకాయల వెంకటేష్ పాల్గొన్నారు.

సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



అమలాపురంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాల చేస్తున్న మహిళలు

అమలాపురం టౌన్: శ్రావణ మాసం తొలి శుక్రవారం సందర్భంగా స్థానిక భూపయ్య అగ్రహారంలోని శ్రీరామచంద్రస్వామి ఆలయంలో విశ్వ హిందూ పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు వైభవంగా నిర్వహించారు. మహిళలు లలితా సహస్ర నామాలతో కుంకుమార్చన చేశారు. వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షురాలు భమిడిపాటి లక్ష్మి, జిల్లా సంపర్క్ కృష్ణమూర్తి, అర్చకులు నారాయణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం తహసీల్దార్‌గా కిషోర్‌బాబు



అమలాపురం తహసీల్దార్ కిషోర్‌బాబును అభినందిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

అమలాపురం రూరల్: అమలాపురం తహసీల్దార్‌గా జీడీ కిషోర్‌బాబు శుక్రవారం బాధ్యతల స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన కనకరాజు ప్రస్తుతం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో తహసీల్దార్‌గా కిషోర్‌బాబును నియమించారు. డీటీ సుబ్రహ్మణ్యం, జిల్లా వీర్వోల సంఘం అధ్యక్షుడు సాధనాల ఎల్లేశ్వరరావు, కె.గణేష్, గణపతి శ్రీధర్, రెవెన్యూ ఉద్యోగులు కిషోర్‌బాబుకు శుభాకాంక్షలు తెలిపారు.

ఐ.పోలవరం తహసీల్దార్‌గా అనిల్‌కుమార్

ఐ.పోలవరం: మండల తహసీల్దార్‌గా డీవీఎస్ అనిల్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రెవెన్యూ సిబ్బంది ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నిక

అమలాపురం టౌన్: అమలాపురం కొంకాపల్లి జవహర్ లాల్ నెహ్రూ మున్సిపల్ హైస్కూలు ఎస్ఎంసీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. ఎస్ఎంసీ చైర్మన్‌గా వానపల్లి మునికోటి రాంబాబు, వైస్ చైర్‌పర్సన్‌గా కారెం మానికతో పాటు మరో 13 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.సత్యనారాయణ పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించారు. విద్యార్థులు తల్లిదండ్రులు ఈ ఎన్నికల్లో పాల్గొన్నారు. ఎన్నికల అనంతరం కమిటీ నూతన కార్యవర్గాన్ని వార్డు కౌన్సిలర్ తిక్కిరెడ్డి సత్య లక్ష్మి అభినందించారు.

పథకాలకు ఎక్సైజ్ ఆదాయం తప్పనిసరి

యానాం: పుదుచ్చేరిలో పథకాల అమలుకు ఎక్సైజ్ ఆదాయం తప్పనిసరిగా అవసరమని సీఎం రంగసామి పేర్కొన్నారు. శుక్రవారం అసెంబ్లీలో ఎమ్మెల్యే కల్యాణ సుందరం మద్యం షాపులకు ఇష్టానుసారం అనుమతిస్తున్నారని అడిగిన ప్రశ్నకు ఆయన జవాబు ఇచ్చారు. పుదుచ్చేరికి మద్యం ఆదాయం ప్రధాన వనరు అని దాని తర్వాత కమర్షియల్ ట్యాక్స్ నుంచి వస్తుందన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో మద్యం నుంచి రూ.1,488 కోట్లు ఆదాయం వచ్చిందని ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.1,600 కోట్లు ఆదాయం లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ప్రస్తుతం యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరి వ్యాప్తంగా మొత్తం 545 లిక్కర్ అవుట్‌లెట్లు ఉన్నాయన్నారు.

దివ్యాంగులను సేవా దృక్పథంతో ఆదుకోవాలి



దివ్యాంగులకు పౌష్టికాహారం అందిస్తున్న జడ్జి రహంతుల్లా

ముమ్మిడివరం: దివ్యాంగులను ప్రభుత్వపరంగానే కాకుండా సేవా దృక్పథంతో స్వచ్ఛంద సంస్థలు ఆదుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా సూచించారు. ముమ్మిడివరం భవితా సెంటర్‌లో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రత్యేక అవసరాల పిల్లలు చదువుకునే చోట మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఇందులో ఏమైనా ఇబ్బందులుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఉచిత న్యాయ సహాయం, దివ్యాంగుల చట్టాలపై పిల్లల తల్లితండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కాశీ సిద్ధార్థ కుమార్, బార్ అధ్యక్షుడు దాసరి సత్యనారాయణ, గ్రంధి రామారావు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగుల నిరసన దీక్ష



ఆర్ఏఓ ఆఫీసు వద్ద నిరసన దీక్ష చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

యానాం: తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ పుదుచ్చేరి మున్సిపల్, కమ్యూన్ పంచాయతీ ఉద్యోగులు ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం యానాం మున్సిపల్ ఉద్యోగులు నాల్గవ రోజు నిరసన దీక్ష కొనసాగించారు. స్థానిక ఆర్ఏవో కార్యాలయం వద్ద ఈ నిరసన దీక్షకు పలువురు నాయకులు పాల్గొని సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘ నాయకులు మాట్లాడుతూ నెలల తరబడి జీతాలు చెల్లించాలని, రిటైర్ అయిన వారికి ఇప్పటివరకు పెన్షన్ బెనిఫిట్స్, పింఛన్లు రావడం లేదని వారికి తం న్యాయం చేయాలని కోరారు. జీతాలను ట్రెజరీల ద్వారా చెల్లించాలని, విధుల్లో ఉండి మృతి చెందినవారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని తదితర డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు పి కృష్ణ, వైస్‌ప్రెసిడెంట్ కర్రి రాంబాబు, ట్రెజరర్ చెల్లి గోపీనాథ్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహంపై దాడి దారుణం



ముమ్మిడివరంలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న దళిత నాయకులు

ముమ్మిడివరం: బెజవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పంపై పచ్చమూకల చీకటి దాడికి రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ ఆరోపించింది. ముమ్మిడివరం పోలమ్మ చెరువు వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. అధికారుల సమక్షంలోనే ఈ దారుణానికి వడిగట్టడం ప్రజా స్వామ్యానికి గొడ్డలి పెట్టని దళిత సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశా యి. కోలా బాబ్జి, కాశి జగపతి, వడ్డి శ్యామ్ ప్రసాద్, బుడితి శ్రీనివాస్, పులిదిండి రాజేష్, నక్కా రామకృష్ణ, నందిక శ్రీను, నక్కా ప్రకాష్ పాల్గొన్నారు.

వీరేశ్వర అన్నదాన ట్రస్ట్‌కు విరాళాలు



భక్తుడు బెజవాడ దేవిత్‌కు స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని అందజేస్తున్న దృశ్యం

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వర స్వామి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు శుక్రవారం భక్తులు విరాళాలు అందజేశారు. ఒంగోలు గ్రామానికి చెందిన బెజవాడ దేవిత్ శాశ్వత అన్నదాన పథకానికి రూ.10 వేలు, మహారాష్ట్ర థానే గ్రామానికి చెందిన జీవీఆర్‌కే శర్మ రూ.10,116 ఆలయ పర్యవేక్షణధికారి బి వీరభద్రరావుకు అందజేశారు. దాతలను, ఆలయ సహా య కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ అభినందించారు. తొలుత వీరికి ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామి వారి శేషవస్త్రం, చిత్రపటం అందించారు.

సుప్రీం తీర్పును రద్దు చేయాలి

ఐ.పోలవరం: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని ఐ.పోలవరం మాల మహానాడు డిమాండ్ చేసింది. స్థానిక అంబేడ్కర్ కమ్యూనిటీహాల్‌లో శుక్రవారం జిల్లా కార్యదర్శి రేవు శ్రీను అధ్యక్షతన మండల మాలమహానాడు సమావేశం నిర్వహించి ఉద్యమ కార్యాచరణపై చర్చించారు. ఈ నెల 11న అమలాపురంలో భారీ బహిరంగ సభ జరగనుందని, ఈ సభకు జాతీయ, రాష్ట్ర స్థాయి మాలమహానాడు నాయకులు హాజరవుతారని తెలిపారు.

ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ రేపు నిరసన సభ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా మాల మహానాడు జేఏసీ నాయకులు

అమలాపురం టౌన్: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ తీర్పును వ్యతిరేకిస్తూ ఈనెల 11న అమలాపురం గడియారం స్తంభం సెంటరులో నిరసన సభను నిర్వహిస్తున్నట్లు జిల్లా మాల మహానాడు జేఏసీ నేతలు వెల్లడించారు. ఇదే వేదికపై ఆ రోజు మాల మృతవీరుల సంస్మరణ సభ కూడా నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈనెల 11వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్న ఈ నిరసన సభ, సంస్మరణ సభలకు అంబేడ్కర్ వాదులు, ప్రజాస్వామిక వాదులు, వర్గీకరణ వ్యతిరేకవాదులు హాజరై విజయవంతం చేయాలని జేఏసీ నేతలు పిలుపునిచ్చారు. స్థానిక దాబా గార్డెన్స్‌లో శుక్రవారం నిర్వహించిన మాల మహానాడు జిల్లా జేఏసీ నేతల సమావేశం ఆ సభల నిర్వహణపై చర్చించింది. మాల మహానాడు జేఏసీ జిల్లా నాయకులు పండు అశోక్‌కుమార్, పెయ్యల పరశురాముడు, ఉండ్రు బాబ్జి, జగడం సత్యనారాయణ మాట్లాడారు. ఈనెల 1న సుప్రీంకోర్టు ఏడుగురు జడ్జిలతో కూడిన ధర్మాసనం ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించాలని మాల మహానాడు జేఏసీ నేతలు విజ్ఞప్తి చేశారు. త్వరలోనే మాల మహానాడు జేఏసీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో రివ్యూ పిటీషన్ వేయనుందని వారు స్పష్టం చేశారు. 2004లో అయిదుగురు జడ్జిలతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం ఎస్సీలను వర్గీకరించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు లేదని ఇచ్చిన తీర్పును వారు గుర్తు చేశారు. సమావేశంలో మాల మహానాడు జేఏసీ నాయకులు చింతా రామకృష్ణ, నాతి శ్రీను, బొంతు రమణ, చీకురుమిల్లి కిరణ్, సాపే బాలరవి, పోతుల నాగరాజు ప్రసంగించారు.

పారాటీచర్స్‌ను క్రమబద్ధీకరించాలి



పుదుచ్చేరి విద్యాశాఖ కార్యదర్శి జవహర్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో వివిధ పాఠశాలల్లో పారాటీచర్స్‌గా విధులు నిర్వహిస్తున్న వారిని క్రమబద్ధీకరించేలా చర్యలు తీసుకోవాలని పుదుచ్చేరి విద్యాశాఖ కార్యదర్శి ఐఏఎస్ అధికారి జవహర్‌ను ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కోరారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో కలుసుకుని యానాం విద్యారంగ సమస్యలు, పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారాటీచర్స్‌గా అనేక ఏళ్లుగా సేవలు అందిస్తున్నారని వారిని రెగ్యులర్ చేయాలని వారికి న్యాయం చేయాలని కోరారు. దీనికి స్పందించిన ఆయన టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) అర్హత ఉన్నవారికి మాత్రమే అవకాశం ఇచ్చేలా ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలిపారు. హౌస్‌కీపింగ్‌గా పనిచేస్తున్న వారిని సైతం రెగ్యులరైజ్ చేయాలని కోరారు. బీపీఎల్ వారికి ఎరుపురంగు రేషన్‌కార్డులు మంజూరు చేయాలని, దారిద్ర్యరేఖకు దిగువనున్న (బీపీఎల్) కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు అందే విధంగా ఎరుపు రంగు రేషన్‌కార్డులను మంజూరు చేయాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కోరారు. శుక్రవారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ కొన్నేళ్లుగా బీపీఎల్‌వారికి పసుపురంగు కార్డు ఇవ్వడంతో వారికి కనీసం నిత్యావసర వస్తువులు సైతం ఇవ్వడం లేదన్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించాలన్నారు.

ఉత్సాహంగా యూత్ మారథాన్ ర్యాలీ



భట్నవెల్లిలో యూత్ మారథాన్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఏఎస్పీ ఖాదర్ బాషా

అమలాపురం రూరల్: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన పెంచడానికి అమలాపురం మండలం భట్నవిల్లి జంక్షన్ నుంచి పేరూరు వై.జంక్షన్ వరకు ఉత్సాహంగా యూత్ మారథాన్ ర్యాలీ నిర్వహించారు. డీఎంఅండ్ హెచ్ఓ దుర్గారావు దొర, జిల్లా లెప్రసీ ఎయిడ్స్ టీబీ నియంత్రణ అధికారి సీహెచ్.వి.భరతలక్ష్మి ఆధ్వర్యంలో ఈ ర్యాలీ కొనసాగింది. జిల్లా అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఖాదర్ బాషా ఈ ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీలో 90 మంది విద్యార్థులు, యువకులు, మెడికల్, క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భరత లక్ష్మి, డీఎంహెచ్ఓ దుర్గారావు దొర మాట్లాడుతూ మారథాన్-రెడ్ రన్ 17-25 సంవత్సరాల యువత కోసం కళాశాల విద్యార్థులు, రెడ్ రిబ్బన్స్‌తో చేపట్టామన్నారు. రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో సాధారణ, కౌమార ఆరోగ్యానికి సంబంధించిన ప్రశ్నలను రుతు పరిశుభ్రత, ఆరోగ్యకరమైన ఆహారం, హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తుందన్నారు. జిల్లా కోనసీమ క్రీడా అభివృద్ధి అధికారి పి.సురేష్‌కుమార్, విద్యార్థులు, పీఈడీలు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

అమలాపురం టౌన్: సినీ హీరో మహేష్‌బాబు జన్మదిన వేడుకల సందర్భంగా ఆయన అభిమాన సంఘాల ప్రతినిధులు స్థానిక రమా థియేటర్ ఆవరణలో పేద మహిళలకు చీరలను శుక్రవారం పంపిణీ చేశారు. మహేష్‌బాబు అభిమానులు కేక్‌ను కట్ చేసి వేడుకలు చేసుకున్నారు. ఆయన పేరుతో స్థానిక శ్రీకామాక్షీ పీఠంలోని అనాథ పిల్లలకు అన్నదానం చేశారు. పట్టణ అభిమానుల సంఘం అధ్యక్షుడు కొప్పిశెట్టి నరసింహమూర్తి, గౌరవాధ్యక్షుడు చొల్లంగి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో

అల్లవరం: గోడిలంక భవిత కేంద్రంలో సినీ హీరో మహేష్‌బాబు పుట్టిన రోజు వేడుకలను కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక అవసరాల గల పిల్లలతో కలిసి మంత్రి సుభాష్ కేక్ కట్ చేశారు. గంధం పల్లంరాజు, దొంగ శ్రీను, ఎంఈఓ కిరణ్‌బాబు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: మహేష్ బాబు ఫ్యాన్స్ అధ్యక్షుడు పిల్లినాగరాజు ఆధ్వర్యంలో పలు చోట్ల రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.